సాక్షి ఖమ్మం

గురువారం । 4 । జూలై । 2024



భూ వినియోగంపై సర్వే

జిల్లాలో సాగు భూమిని ఏయే అవసరాలకు వినియోగిస్తున్నారనే అంశాన్ని తేల్చేందుకు సర్వే చేపడుతున్నారు.

8లో



చింతకానిలో మరో భూవివాదం

ప్రొద్దుటూరులో రైతు ఆత్మహత్య ఘటనను మరువకముందే చింతకాని మండలంలో మరో భూవివాదం తెరపైకి వచ్చింది.

8లో



వాతావరణం

జిల్లాలో గురువారం సాయంత్రం వరకు ఎండగాఉంటుంది. ఆతర్వాత వాతావరణం చల్లబడి కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వన్యప్రాణుల సంరక్షణ చర్యలు భేష్



మాట్లాడుతున్న సీసీఎఫ్ భీమానాయక్, పక్కన డీఎఫ్ఓ విక్రమ్‌సింగ్

సత్తుపల్లిటౌన్: జిల్లాలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ తెలిపారు. సత్తుపల్లిలోని అటవీ అతిథి భవనంలో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్‌తో కలిసి పలువురు అటవీ అధికారులను సత్కరించారు. అనంతరం భీమానాయక్ మాట్లాడుతూ ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేసి వనమహోత్సవాన్ని విజయవంతం చేశారని అభినందించారు. మధిర, తల్లాడ, కూసుమంచి రేంజ్‌ల్లోని అటవీశాఖాధికారులు ఎస్.కొండారెడ్డి, పి.శ్రీనివాసరావు, యు.సురేష్, బి.నాగేశ్వరరావు, కే.వీ.రామారావు, నాగరాజు, పి.సురేష్‌కుమార్, ఎం.హరికృష్ణను సత్కరించారు. ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, అధికారులు పి.స్నేహలత, కె.అరవింద్, బి.రాధిక, వి.హరిప్రసాద్, పి.శ్రీనివాసరావు, ఎస్.విజయలక్ష్మి, జి.కవితా మధురి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈఓ

తిరుమలాయపాలెం: కళాశాలలో విద్యార్థుల సంఖ్య మరింతగా పెంచి మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు సూచించారు. మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం సందర్శించిన ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డు తీసుకొస్తున్న 'ఇంటర్ ఎడ్యుకేషన్ యాప్' ఉద్దేశాలను వివరించారు. అలాగే, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులు, అధ్యాపకులు పాటుపడాలని తెలిపారు ఆతర్వాత కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి కౌన్సెలింగ్ మొదలవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జకీరుల్లా, కౌన్సెలింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. మొదటి విడతలో గురువారం నుంచి 12వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ చేసుకునే అవకావం ఉండగా, 6వ తేదీ నుంచి 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు ఎప్‌సెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, ఆరు నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న ఆదాయ ధృవీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్‌కు అర్హులైతే ఈ ఏడాది తీసుకున్న సర్టిఫికెట్, స్లాట్ బుకింగ్ రశీదులో ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ సూచించారు.





2023, 2024లో భూగర్భ జలమట్టం (జిల్లా సగటు.. మీటర్లలో)

నెల	2023	2024
మార్చి	5.15	6.86
ఏప్రిల్	5.68	7.56
మే	5.76	7.30
జూన్	6.02	6.99

పాతాళంలోకి గంగ

జిల్లాలో నానాటికీ తగ్గుతున్న భూగర్భ జలాలు

- గత ఏడాదితో పోలిస్తే ఇంకా పడిపోయిన వైనం
- సమృద్ధిగా వర్షాలు లేక ఇబ్బందులు
- బోర్లు, బావుల కింద సాగుపై రైతుల్లో ఆందోళన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో భూగర్భ జలమట్టం ఏటా తగ్గుముఖం పడుతోంది. సమృద్ధిగా వర్షాలు లేక ఈ పరిస్థితి ఎదురవుతోంది. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్నాయి. గత ఏడాది మార్చి నుంచి జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలాలు మరింత దిగజారడంతో బోర్లు, బావుల కింద సాగు చేపట్టిన రైతుల్లో ఆందోళన మొదలైంది. అయితే వర్షాలు కురిస్తే భూగర్భ జలాలు పెరిగే అవకాశముందని భూగర్భ జల శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది జూన్ చివరి నాటికి 6.02 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉంటే ఇప్పుడు ఇదే సమయాన 6.99 మీటర్ల లోతుల్లోకి వెళ్లడం గమనార్హం.

వర్షాభావ పరిస్థితులతోనే..

గత ఏడాది వానాకాలంలో వర్షాలు సక్రమంగా కురవలేదు. ఈ ఏడాది సైతం జూన్ తొలివారంలో అనుకున్న మేరకు వర్షాలు కురవక భూగర్భ జలమట్టం కొంత మేర తగ్గింది. ఈక్రమంలో వ్యవసాయ పనులు ఊపందుకోలేదు. జూన్ చివరి వారంలో వర్షాలు మొదలయ్యాయి. గత ఏడాది యాసంగిలో అకాల వర్షాలతో భూగర్భ జలాలు కొంత మేర పెరిగినా, ఈ ఏడాదిలో యాసంగిలో అకాల వర్షాల జాడే లేదు. ఈ పరిణామాలతో బోర్లు, బావుల మీద ఆధారపడి సాగు చేస్తున్న రైతులు ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సాగుపై ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

మరింత లోతుల్లోకి..

గత ఏడాది మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలతో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలం మరింత అడుగంటింది. 2023 మార్చిలో 5.15 మీటర్ల లోతులో నీరు ఉండగా ఈ ఏడాది మార్చిలో 6.86 మీటర్ల లోతుల్లోకి వెళ్లింది. అంటే 1.71 మీటర్ల మేర తగ్గింది. ఇక 2023 ఏప్రిల్‌లో 5.68 మీటర్ల లోతులో నీరు ఉండగా, ఈ ఏప్రిల్‌లో 7.56 మీటర్ల లోతులోకి జలాలు పడిపోయాయి. తద్వారా1.88 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయినట్లయింది. అలాగే, 2023 మేలో 5.76 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు ఈ ఏడాది 7.30 మీటర్ల లోతుకు పడిపోవడంతో 1.54 మీటర్ల మేర తగ్గినట్లయింది. ఇక 2023 జూన్‌లో 6.02 మీటర్ల లోతులో ఉండగా, ఈ ఏడాది జూన్‌లో 6.99 మీటర్ల లోతుకు పడిపోయాయి. అంటే 0.97 మీటర్ల లోతుకు నీరు వెళ్లింది. అయితే, జూన్ నెలాఖరులో వర్షాలు కురవడం మొదలు కావడం, ఈనెలలోనూ వానలు ఆశాజనకంగా ఉంటే భూగర్భ జలాల్లో పెరుగుదల కనిపించే అవకాశముంది.

ఇక్కడ ఆశాజనకం..

గత ఏడాది జూన్‌తో పోలిస్తే కొన్ని మండలాల్లో భూగర్భ నీటిమట్టం పెరిగింది. కొణిజర్ల మండలంలో గత ఏడాది జూన్‌లో 2.92 మీటర్ల వద్ద ఉండగా.. ఈ జూన్‌లో 2.56 మీటర్ల వద్దే నీరు లభ్యమవుతోంది. సింగరేణిలో గత ఏడాది జూన్‌లో 7.32 మీటర్లలో నీరు ఉంటే ఈ ఏడాది 6.04 మీటర్ల వరకు రావడం విశేషం.

ఈ మండలాల్లో ఆందోళనకరం

జిల్లాలోని పలు మండలాల్లో భూగర్భ జలాలు ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్నాయి. ప్రధానంగా సత్తుపల్లిలో భూగర్భ జలాల పరిస్థితి దారుణంగా ఉంది. అయితే ఈ ఏడాది జూన్‌లో కొంత మేర పెరగడం ఉపశమనం కలిగించే అంశం. ఇక్కడ గత ఏడాది మార్చిలో 16.33 మీటర్ల లోతులో ఉండగా ఈ ఏడాది ఏకంగా 18.15 మీటర్ల లోతుకు, గత ఏడాది ఏప్రిల్‌లో 17.65 మీటర్లలో ఉంటే ఈ ఏడాది 18.83 మీటర్ల లోతులోకి, గత ఏడాది మేలో 17.05 మీటర్ల వద్ద నీటి లభ్యత ఉండగా, ఈ ఏడాది మేలో 17.57 మీటర్లకు, గత ఏడాది జూన్‌లో 17.03 మీటర్ల వద్ద ఉన్న జలాలు ఈ ఏడాది జూన్‌లో 16.22 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇక కామేపల్లి మండలంలో కూడా పరిస్థితి అలాగే ఉంది. గత ఏడాది జూన్‌లో ఇక్కడ 10.59 మీటర్లలో నీరు ఉంటే ఈ జూన్‌లో 16.22 మీటర్ల లోతులో నీటి లభ్యత ఉంది. గతేడాదితో పోలిస్తే 5.63 మీటర్లకు నీరు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ఇక మధిరలో గత జూన్‌లో 6.36 మీటర్లలో నీరు ఉంటే ఈ జూన్‌లో 9.58 మీటర్లలో నీరు ఉంది. అంతేకాక ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, రఘునాథపాలెం, ఎర్రుపాలెం, ఖమ్మం, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, బోనకల్, చింతకాని, ముదిగొండ తదితర మండలాల్లో సైతం జూన్‌లో భూగర్భ జలాలు తగ్గాయి.

ఎదురుచూపులకు తెర

ఉద్యోగుల బదిలీలకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- 9నుంచి 12వ తేదీ వరకు ఆప్షన్లు
- 19, 20వ తేదీల్లో ఉత్తర్వులు
- జిల్లాలో 3వేల మందికి స్థానచలనం కలిగే అవకాశం



ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ శాఖల్లో ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు వినిపించింది. ఎన్నికలు ముగిసి నెలలు దాటుతున్నా బదిలీలపై ప్రకటన లేక సందిగ్ధత ఎదురవుతుండగా.. ప్రభుత్వం స్పందించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్లుగా బదిలీలు లేక ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల్లో ప్రభుత్వ ఉత్తర్వులతో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలోని 58ప్రభుత్వ శాఖల్లో సుమారు 7వేల మంది అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల ప్రకారం విధులకు ఆటంకం ఏర్పడకుండా 40శాతం మందికి అంటే సుమారు 3వేల మందికి స్థానచలనం కలగనుంది.

ఆరేళ్ల తర్వాత మోక్షం

ప్రభుత్వ ఉద్యోగులు సుమారు ఆరేళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. కుటుంబ అవసరాలు, ఆరోగ్య పరిస్థితులు, ఇతర కారణాలతో సొంత ప్రాంతాలకు లేదా అక్కడ సమీపానికి వెళ్లాలని ఎదురుచూస్తున్న వారి ఆశలు ఫలించలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేయగా ఆనందం వ్యక్తమవుతోంది.

ఇవీ నిబంధనలు

ఒకే ప్రాంతంలో రెండేళ్ల నుంచి పనిచేస్తున్న వారికి బదిలీకి అవకాశం కల్పించలేదు. అయితే, జీవిత భాగస్వామి విధినిర్వహణ కారణంతో దరఖాస్తు చేసుకుంటే పరిగణనలోకి తీసుకుంటారు. గతనెల 30నాటికి ఒకేచోట నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగిని తప్పనిసరి బదిలీ చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ లోపు ఉద్యోగ విరమణ చేయనున్న వారిని బదిలీల నుంచి మినహాయిస్తారు. షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు కేటగిరీలు, కేడర్ల వారీగా ఉద్యోగుల జాబితాలతో పాటు ఖాళీలను వెల్లడిస్తారు. ఆపై 9నుంచి 12వరకు ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించి, 13నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. అనంతరం అర్హులకు 19, 20వ తేదీల్లో బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కాగా, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా సాగేలా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్, వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

గతానికి భిన్నంగా...

గతంలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ సమయాన 20శాతం మాత్రమే అవకాశం ఉండేది. ఈసారి మాత్రం 40శాతం మంది ఉద్యోగులకు బదిలీలకు జరగనుంది. ఆరేళ్ల తర్వాత బదిలీలు జరగనుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉంటుందని తెలుస్తోంది. పోలీసులు, ఉపాధ్యాయులకు మినహా వైద్య ఆరోగ్య శాఖ, రిజిస్ట్రేషన్లు, సీపీఓ, సర్వే అండ్ రికార్డ్స్, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు, గ్రామపంచాయతీలు, ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఫారెస్ట్, వ్యవసాయం, ట్రెజరీ, అన్ని సంక్షేమ శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు బదిలీలు జరగనున్నాయి. కాగా, బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యాన టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుతో పాటు టీఎన్జీవోస్, వివిధ ఉద్యోగుల సంఘాల బాధ్యులు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

పచ్చదనంతోనే ప్రశాంతత..



గొల్లగూడెంలో మొక్క నాటిన మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాగమయి, అటవీ అధికారులు నదీమ్ అహ్మద్, భీమానాయక్, విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ మధుసూదన్, సీపీ సునీల్‌దత్, కాంగ్రెస్ నాయకులు దయానంద్ తదితరులు

- ప్రతీఒక్కరు మొక్కలు నాటితే ఫలితం
- రాష్ట్రంలో 22 కోట్ల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి..
- వనమహోత్సవంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన మరో మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: 'ప్రస్తుతం చల్లని నీడనిచ్చే చెట్లు ఎక్కడా కనిపించడం లేదు.. ఇళ్లు, రోడ్ల వెడల్పుతో పెద్దపెద్ద వృక్షాలను తీసేస్తున్నాం.. భవిష్యత్ తరాలకు ఆపద ఎదురుకావొద్దంటే ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి' అని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెనుబల్లి మండలం గొల్లగూడెం బీట్‌లో అటవీశాఖ, ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఆమె రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి వనమహోత్సవ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ 1950లో కేంద్రమంత్రి మున్షీ మొక్కలు నాటాలని వనమహోత్సవాన్ని చేపట్టారని, ఈకార్యక్రమానికి 75 ఏళ్లు పూర్తయినందున సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వరంగల్‌లో ప్రారంభించామని తెలిపారు. ఈనేపథ్యాన ప్రతిఒక్కరు మొక్కలు నాటి కాపాడాలని.. తద్వారా సమాజానికి మంచి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నాటేందుకు 22 కోట్ల మొక్కలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. కాగా, తాను పల్లెటూరు వాతావరణంలోనే పుట్టి పెరిగానని చెప్పిన మంత్రి, ఆ రోజుల్లో ప్రతిఇంటి ఎదుట పచ్చని పందిళ్లు, మల్లెచెట్టు, బతానీ చెట్లు ఉండేవని గుర్తు చేసుకున్నారు. ఈనేపథ్యాన మొక్క నాటితే వాటికి పూవు పూసినా, పండు కాసినా ఎంత ఆనందం వేస్తుందో మాటల్లో చెప్పలేమని తెలిపారు.

పచ్చదనమే గొప్పతనం..

ఎంత ఒత్తిడిలో ఉన్నా, పచ్చని చెట్ల మధ్య గడిపితే వచ్చే ప్రశాంతతను మాటల్లో వర్ణించలేమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొక్కలు పెంచటం చాలా కష్టమని, కానీ చెట్లు నరకటం చాలా సులువని చెప్పారు. మనిషి బతకాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతిఒక్కరు 5 నుంచి 10 మొక్కలు నాటితే రాష్ట్రమంతా పచ్చదనం పరుచుకుంటుందని తెలిపారు.

చెట్ల విలువ కరోనా సమయాన తెలిసింది..

ఆక్సిజన్ అందక వేలాది మంది విలవిల్లాడిన కరోనా సమయంలో చెట్లు ఎంత అవసరమో తెలిసొచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ అన్నారు. సత్తుపల్లి ప్రాంతాన్ని కోనసీమలా పచ్చదనంతో నిండేలా ఐదేళ్లలో 5 లక్షల మొక్కలను నాటేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. బొగ్గు గనుల తవ్వకాలతో దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యతను సరిచేసేలా అందరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్, చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, సీపీ సునీల్‌దత్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ప్రజాకవి జయరాజు, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు కూసంపూడి మహేష్, తోట సుజలరాణితో పాటు గాదె చెన్నారావు, చల్లగుళ్ల నర్సింహారావు, మందపాటి ముత్తారెడ్డి, ఎం.డీ.కమల్‌పాషా, ఎస్.కే.మౌలాలీ, దూదిపాల రాంబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో రిటైర్‌మెంట్ స్కీమ్

- జిల్లాలో 21మంది టీచర్లు, 203మంది హెల్పర్లకు ముగిసిన సర్వీస్
- ఈనెల 1న నుంచి హాజరు నమోదు నిలిపివేత
- టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50వేల మేర నగదు సాయం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్)లో భాగమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం రిటైర్‌మెంట్ ప్రకటించింది. ఇది ఈనెల 1నుంచే అమల్లోకి వచ్చింది. ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65ఏళ్లు పైబడిన టీచర్లు, హెల్పర్లకు రిటైర్‌మెంట్ వర్తింపచేస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుండి ఉత్తర్వులు అందాయి. ఈ ఉత్తర్వులను తక్షణమే అమలుచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఈనెల 1 నుండి వారికి హాజరు నమోదు నిలిపివేయాలని సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు సూచనలు చేశారు.

నగదు, సర్వీస్ పెంచాలని కోరినా...

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో 65ఏళ్లు నిండిన వారు 21మంది టీచర్లు, 204మంది ఆయాలు ఉన్నారు. వీరికి రిటైర్‌మెంట్ ప్రకటించిన నేపథ్యాన టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేల చొప్పున ఒకేసారి నగదు చెల్లించనున్నారు. అయితే, టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. అంతేకాక సర్వీస్ పొడిగించాలని కోరుతున్నారు. కానీ రాష్ట్రప్రభుత్వం ఈ డిమాండ్‌ను పక్కకు పెట్టి గతంలో నిర్ణయించిన విధంగానే సాయం అందించేందుకు సిద్ధం కావడంతో వారికి నిరాశే మిగిలింది.

నోటిఫికేషన్‌తో భర్తీ

జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 96 టీచర్ల పోస్టులు, 395 ఆయాల పోస్టులు గతంలోనే ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు రిటైర్ అయిన వారితో కలిపితే 117 టీచర్, 599 ఆయా పోస్టులు ఖాళీ కానున్నాయి. వీటిని రాష్ట్రప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తుందని చెబుతున్నారు. ఈవిషయమై ఇటీవల జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులు వెల్లడించారని జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. అయితే, పోస్టులు భర్తీ చేసే వరకు ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలోని టీచర్లను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నామని వెల్లడించారు.

ఆర్టీసీలో తగ్గనున్న పనిభారం

- పోస్టుల భర్తీపై ప్రభుత్వ ప్రకటన
- ఖమ్మం రీజియన్‌లో ఖాళీగా 200 పోస్టులు
- ఇందులో కండక్టర్, డ్రైవర్ పోస్టులే ఎక్కువ



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీ కార్మికులపై ఎట్టకేలకు పనిభారం తగ్గనుంది. ఆర్టీసీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యాన రీజియన్ పరిధిలో ఖాళీలను అధికారులు గుర్తించారు. మొత్తం 200 వరకు ఖాళీలు ఉన్నట్లు తేల్చగా, ఇందులో ఎక్కువగా కండక్టర్లు, డ్రైవర్ పోస్టులే ఉన్నాయి. ఏదేమైనా చాన్నాళ్ల తర్వాత ప్రభుత్వ ప్రకటనతో కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

భర్తీ కానున్న 200 పోస్టులు

ఆర్టీసీలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యాన రీజియన్ వ్యాప్తంగా 200 మందిని నియమించనున్నారు. వీరిలో కండక్టర్లు 56 మంది, డ్రైవర్లు 116 మందిని భర్తీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు పోస్టుల ఖాళీతో కండక్టర్లు, డ్రైవర్లు డబుల్ డ్యూటీలతో ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అంతేకాక మహాలక్ష్మి పథకం అమలుతో రద్దీ పెరగడం, త్వరలోనే కొత్త బస్సులు రానున్న నేపథ్యంలో ప్రభుత్వం భర్తీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిసింది. డ్రైవర్లు, కండక్టర్లకు తోడు ఖాళీగా ఉన్న మెకానిక్, ఇతర అధికారుల పోస్టులను కూడా భర్తీ చేయడంపై కసరత్తు మొదలైంది.

ఉన్న వారికి ఊరట

ఖమ్మం రీజియన్‌లో ప్రస్తుతం 1,515 మంది కండక్టర్లు, డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. మహాలక్ష్మి పథకానికి తోడు వేసవి సెలవులతో గత ఆరు నెలలుగా రద్దీ పెరగగా వీరు అదనపు డ్యూటీలు చేయాల్సి వస్తోంది. ప్రధానంగా డ్రైవర్లు దూర ప్రాంతాలకు వెళ్లి వచ్చినా మళ్లీ డ్యూటీ చేయాల్సి రావడంతో వారిపై భారం పడుతోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికతో 2021 తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాలు భర్తీ చేయనుండగా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం, కొత్తగూడెంలో కొరత ఎక్కువ..

ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్ల కొరత ఉంది. ఇక నూతనంగా ఏర్పడిన ఇల్లెందు డిపోలో ముగ్గురు కండక్టర్లు ఎక్కువగా ఉండగా.. అదే సంఖ్యలో డ్రైవర్లు తక్కువగా ఉన్నారు. అన్ని డిపోల్లో పరిశీలిస్తే ఖమ్మం, కొత్తగూడెంలో కండక్టర్లు, డ్రైవర్ల కొరత ఎక్కువగా ఉంది. ఖమ్మం డిపోలో 55 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో కండక్టర్లు 16 మంది, డ్రైవర్లు 39 మంది కావాల్సి ఉంది. అలాగే, కొత్తగూడెం డిపోలో కండక్టర్లు 12, డ్రైవర్లు 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇల్లెందు మినహా మిగిలిన డిపోలతో పోలిస్తే కొత్తగూడెం డిపోలో తక్కువ మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇక్కడి నుంచి పెద్దసంఖ్యలో సర్వీసులు నడుస్తున్నప్పటికీ 98 మంది కండక్టర్లు, 77 మంది డ్రైవర్లు మాత్రమే పనిచేస్తుండడం గమనార్హం.

ఖమ్మం రీజియన్ పరిధిలో ఖాళీల వివరాలు

డిపో	కండక్టర్లు		డ్రైవర్లు	
	పనిచేస్తున్నది	ఖాళీలు	పనిచేస్తున్నది	ఖాళీలు
ఖమ్మం	207	16	160	39
మధిర	104	06	78	09
సత్తుపల్లి	142	05	98	16
భద్రాచలం	134	08	159	17
కొత్తగూడెం	98	12	77	19
మణుగూరు	101	09	86	13
ఇల్లెందు	30	-	43	03



క్లుప్తంగా

జాబ్ మేళాలో 19 మంది ఎంపిక

ఖమ్మంరావర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 19 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించగా 42 మంది హాజరయ్యారు. వారిలో 19 మంది ఎంపిక కాగా నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10న ప్రవేశ పరీక్ష

ఖమ్మంసహకారనగర్: 2024 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో ప్రవేశాలకు ఈ నెల 10న పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. తెలంగాణ డిప్లొమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (డీఈఈసీఈటీ) పేరుతో నిర్వహించే ఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వివరాల కోసం https:deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

తల్లీకుమారుడిపై దాడి

నేలకొండపల్లి: ఓ దుకాణం నిర్వాహకురాలైన మహిళతో పాటు ఆమె కుమారుడిపై నలుగురు యువకులు దాడికి పాల్పడ్డారు. మండలంలోని అమ్మగూడెం వద్ద షాపు నిర్వహిస్తున్న తార వద్దకు బుధవారం ముదిగొండకు చెందిన నలుగురు యువకులు వచ్చి, వాటర్ బాటిల్ అడగగా ఆమె లేదని చెప్పింది. దీంతో వారు అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో తార కుమారుడు కృష్ణ అడ్డుపడ్డాడు. ఈ మేరకు యువకులు వీరిద్దపై దాడి చేయగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని జగన్నాథపురంలో కందా శకుంతలకు చెందిన పెసర పంటను లచ్చగూడెంనకు చెందిన పోట్ల శ్రీను, మరో వ్యక్తితో కలిసి ఇటీవల ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు మంగళవారం రాత్రి పోట్ల శ్రీను కొందరితో వచ్చి శకుంతల తండ్రి కోపూరి వెంకటేశ్వర్లుపై దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఖమ్మంలోని మమతా రోడ్డులో దుగ్గిరాల సూర్యనారాయణ మూడు కిలోల గంజాయితో వెళ్తుండగా అబ్దుల్ కలాంనగర్ సమీపాన పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. కాగా, ఆయన గతంలోనూ పలుమార్లు గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడి జైలులో శిక్ష అనుభవించాడు. ఈ మేరకు సూర్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దానవాయిగూడెంలో మోటార్ల చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెంలో రెండు రోజుల వ్యవధిలో నలుగురు రైతుల పొలాల్లోని వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన చిలుకూరి వీరస్వామి, మేడబోయిన మల్లయ్య, లింగయ్య, వెంకన్నకు చెందిన మోటార్లు చోరీ కాగా, బాధితులు ఖమ్మం అర్బన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి



చనిపోయిన గేదెల వద్ద బాధిత రైతు

కామేపల్లి: విద్యుదాఘాతానికి గురై మూడు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తలింగాలలో బుధవారం చోటుచేసుకుంది. రైతు నేలపట్ల గోపాల్‌కు చెందిన పాడి గెదేలు మేత కోసం వెళ్లాయి. పంట పొలాల్లో మేస్తుండగా అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ పక్కన స్టేవైర్‌కు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షల విలువైన గేదెలు మృతి చెందిన నేపథ్యాన తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,425	4,000
కందులు	10,400	8,500
మిర్చి	18,500	8,000
ఏసీ మిర్చి	19,500	10,200
తాలు మిర్చి	8,100	8,000
పత్తి	7,350	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438

భూ వినియోగంపై సర్వే

పైలట్ ప్రాజెక్టుగా ఖమ్మం జిల్లా

- ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లో పూర్తిస్థాయిలో సర్వే
- మిగిలిన మండలాల్లో ఎంపిక చేసిన సర్వే నంబర్లలో ప్రక్రియ
- ఎప్పటికప్పుడు వివరాలు యాప్‌లో నమోదు
- వ్యవసాయ శాఖతో సహా వివిధ శాఖల భాగస్వామ్యం



ఖమ్మం రూరల్ మండలంలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఏఓ విజయనిర్మల

ఖమ్మంవ్యవసాయం: భూవినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక సర్వేకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా సర్వే చేస్తుండగా ఖమ్మం, సంగారెడ్డి, కరీంనగర్, హన్మకొండ, కామారెడ్డి జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రతీ జిల్లాలో రెండేసి మండలాల్లో పూర్తిస్థాయిలో, మిగిలిన మండలాల్లో ఎంపిక చేసిన సర్వే నంబర్లలో సర్వే చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ శాఖలోని ఏఈఓలతో పాటు పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌డీఓ, మున్సిపాలిటీ ఉద్యోగులు, ఉపాధి హామీ ఉద్యోగులను సైతం ఇందులో భాగస్వాములను చేశారు. క్షేత్రస్థాయిలో భూమి ఫొటో తీయడంతోపాటు ఇతర వివరాలను సేకరించి ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ వారం రోజులుగా కొనసాగుతోంది.

53 వేల సర్వే నంబర్లలో సర్వే

జిల్లాలో 53 వేల సర్వే నంబర్లలో భూవినియోగ సర్వే జరుగుతోంది. ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లోని అన్ని సర్వే నంబర్ల భూమి వివరాలు సేకరిస్తుండగా.. మిగిలిన మండలాల్లో 3 వేల నుంచి 4 వేల సర్వే నంబర్లలో సర్వే చేపడుతున్నారు. కాగా, సేకరించిన అంశాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసేందుకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చారు. భూమి సాగులో ఉంటే సరి.. లేకపోతే అందుకు కారణాలను సైతం పొందుపర్చాల్సి ఉంటుంది.

ఏమేం వివరాలు..

ప్రభుత్వ ఆదేశాలతో భూవినియోగంపై వివిధ శాఖల ఉద్యోగులు సర్వే చేస్తున్నారు. భూమి పంట సాగుకు యోగ్యమా, కాదా.. ఏ పంట సాగు చేస్తున్నారు.. ఒకవేళ సాగు చేయకపోతే అందుకు కారణాలు, నీటి లభ్యత, కొండలు, గుట్టలు, వాణిజ్య భూములు, నిర్మాణాలు, చెరువులు, కుంటల కింద ఉన్నాయా లేక ఆర్థిక పరిస్థితి బాగా లేక వదిలేశారా తదితర వివరాలన్నీ సేకరిస్తున్నారు.

ప్రభుత్వ పథకాల అమలుకు దోహదం

భూవినియోగం సర్వే ప్రభుత్వ పథకాల అమలుకు దోహదపడుతుందని చెబుతున్నారు. పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహకాలను అందిస్తోంది. పెట్టుబడి సాయం, పంట రుణాలు, సబ్సిడీలపై యంత్ర పరికరాలు వంటి పథకాలను అమలు చేస్తున్నాయి. అయితే, కొందరు సాగులో లేని భూములు, సాగుకు యోగ్యత లేని భూములను చూపించి లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక పట్టణ, నగర శివార్లలో లేఔట్ భూములు, వెంచర్లు వేసిన భూములకు కూడా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యాన సాగు చేసే భూములకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టిందని తెలుస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన ఐదు జిల్లాల్లో ప్రక్రియ పూర్తయ్యాక.. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించే అవకాశముందని సమాచారం.

చింతకానిలో మరో భూవివాదం

- బిడ్డలకు పసుపు, కుంకుమ కింద భూమి రాసిన తల్లి
- వారికి తెలియకుండా కుమారులకు రిజిస్ట్రేషన్
- తహసీల్ ఎదుట బాధితుల ఆందోళన



తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న వెంకట్రావమ్మ

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన రైతు ప్రభాకర్ భూవివాదంలో ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే ఇదే మండలంలో మరో భూవివాదం వెలుగుచూసింది. ఈ ఘటనలోనూ తహసీల్దార్ కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తుండటంతో ఆయన తీరుపై బాధితులు మండిపడుతూ తహసీల్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పందిళ్లపల్లికి చెందిన మండె తులిశమ్మ భర్త చనిపోయాక నలుగురు కుమార్తెలకు రెండెకరాల చొప్పున భూమి ఇచ్చారు. ఆపై ఇంకో రెండెకరాలు తులిశమ్మ పేరిట ఉండగా ఆమె ఇద్దరు కుమార్తెలు వెంకట్రావమ్మ, నాగమణికి 2020లో 10 కుంటల చొప్పున 20 కుంటల భూమిని పసుపు, కుంకుమ కింద రాసిచ్చింది. ఆ భూమిని పట్టా చేయించుకోకపోవడాన్ని ఆసరాగా తీసుకున్న తులిశమ్మ కుమారులు హన్మంతరావు, నాగయ్య, చంద్రయ్య, రామారావు గిఫ్ట్ డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని భావించారు.

అడ్డుకున్న వారిపై దాడి

భూమి రిజిస్ట్రేషన్ కోసం తులిశమ్మ కుమారులు గత బుధవారం స్లాట్ బుక్ చేయించారు. ఈ విషయం తెలిసిన ఆమె కుమార్తెలు తహసీల్‌కు వచ్చి తల్లి రాసిచ్చిన అగ్రిమెంట్లను చూపించి రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరారు. దీంతో కోపోద్రిక్తులైన కుమారులు తహసీల్దార్ ఎదుటే తమ సోదరీమణులపై కర్రలతో దాడికి పాల్పడగా రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. ఆపై గిఫ్ట్ డీడ్ కాకుండా కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్ ఉంటే న్యాయపరంగా సమస్యలు రావని తులిశమ్మ కుమారులకు తహసీల్‌లోని కీలక అధికారి సూచన చేసినట్లు తెలుస్తుండగా వారు వృద్ధురాలైన తమ తల్లిని మాయమాటలతో నమ్మించి పత్రాలు తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం ముగ్గురికి, బుధవారం మరో కుమారుడికి 20 కుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేసేశారు. ఈ విషయం బయటపడడంతో వెంకట్రావమ్మ, నాగమణి చేరుకుని వివాదంలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరినా ఎందుకు పట్టించుకోలేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. అయితే, తల్లి వారికి రాసిచ్చిన అగ్రిమెంట్ చెల్లదని, కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే రిజిస్ట్రేషన్ ఆపుతామని చెప్పగా మండిపడ్డారు. తహసీల్దార్ పెద్దమొత్తంలో డబ్బు తీసుకుని తమ తల్లి దగ్గర భూమి కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్లు రాయించి కుమారుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు.

నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థి, యువజనులు పాలకులను ఉచిత పథకాలు అడగడం లేదని.. నాణ్యమైన విద్య, ఉపాధి మాత్రం ఇస్తే చాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల కోసం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు ఆరోపించారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ రెండు సంఘాల కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, షేక్ బషీరుద్దీన్, వి.వెంకటేశ్, జి.మస్తాన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 72 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, తద్వారా విద్యార్థుల భవితవ్యం డోలాయమానంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయినా ప్రధాని మోదీ స్పందించకపోవడం విచారకరమన్నారు. నీట్‌ను రద్దు చేయడమే కాక ఎన్నికల ముందు విద్యార్థి, యువజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో గురువారం నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘాల నాయకులు సాయి, ఆసిఫ్, మంద సురేశ్, రమేశ్, లక్ష్మణ్, రమేశ్, మద్దోజు శ్రావణ్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పదెకరాల వరకు 'భరోసా' చాలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

నేలకొండపల్లి: పెట్టుబడి అవసరాలకు రైతు భరోసా పేరిట ప్రభుత్వం ఇస్తున్న నగదు ఉపయోగమే అయినప్పటికీ పది ఎకరాల లోపు వరకు పరిమితం చేయాలని పలువురు రైతులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మండలంలోని మోటాపురం, రాజారాంపేట, పైనంపల్లి, నాచేపల్లి సొసైటీల్లో రైతుల అభిప్రాయ సేకరణకు బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు ఐదు ఎకరాలకు, ఇంకొందరు పది ఎకరాలకు పరిమితం చేయాలని కోరారు. మరికొందరు మాత్రం పరిమితి లేకుండా పంటలు సాగు చేసే వారందరికీ పెట్టుబడి సాయం ఇవ్వాలని కోరగా, కౌలు రైతులకూ ఇవ్వాలని, సబ్సిడీపై ఎరువులనూ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం చెరువుమాధారంలో రైతు చీర్ల భాస్కర్‌రావు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించి సేంద్రియ విధానం అవలంబిస్తుండటంపై అభినందించారు. వరంగల్ జిల్లా కోఆపరేటివ్ డిప్యూటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉషారాణి, ఏడీఏ ఎస్.విజయచంద్ర, ఏఓ అరుణకుమారి, ఉద్యోగులు ఇందుమతి, శశిరేఖ, శిరీష, అరవింద్, ఉదయకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుడితో పని చేయిస్తున్న వ్యక్తిపై కేసు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పెదతండాలో భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం అంజనాపురానికి చెందిన బాలుడితో పనిచేయిస్తున్న మేస్త్రీ గుగులోత్ భిక్షంపై బుధవారం కేసు నమోదైంది. బాలుడితో పనిచేయిస్తున్న విషయమై సమాచారం అందడంతో ముస్కాన్ టీం ఇన్‌చార్జ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చల్లా అంజమ్మ తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు అంజమ్మ ఫిర్యాదు మేరకు భిక్షంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

టీచర్ల సర్దుబాటుకు సహకరించండి



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని హైస్కూళ్లలో అదనంగా సబ్జెక్ట్ టీచర్లు ఉన్న చోట నుంచి అవసరమైన చోటకు సర్దుబాటు చేసేలా ప్రధానోపాధ్యాయులు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో హెచ్‌ఎంలతో బుధవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటుపై అందరూ సహకరిస్తే విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని తెలిపారు. అలాగే, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వాడొద్దని, విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా పర్యవేక్షించాలని, స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ విద్యా సంవత్సరంలో నాలుగు సార్లు నిర్వహించాలని, బేస్‌లైన్ టెస్టు పేపర్లు దిద్ది గ్రేడింగ్‌కు అనుగుణంగా బోధించాలని సూచించారు. సమావేశంలో ఏఎంఓ రవికుమార్, సెక్టోరియల్ ఆఫీసర్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఖమ్మంసహకారనగర్: ఇటీవల బదిలీ అయిన ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్)లను తక్షణమే రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 350 మందికి బదిలీలు నిర్వహించి రిలీవ్ చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులకు ఉపయోగం ఏముందని, వారు స్టేషన్ సర్వీస్ పాయింట్లు నష్టపోతామని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యాన ఎస్‌జీటీలను రిలీవ్ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న గెజిటెడ్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల భర్తీ జరిగే వరకు ఖాళీల్లో విద్యావలంటీర్లను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

డీఈఓకు పీఆర్‌టీయూ వినతి

రిలీవర్లు లేరనే సాకుతో ఎస్‌జీటీలను పాత స్థానాల్లోనే కొనసాగించడం సరికాదని పీఆర్‌టీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ ఈ.సోమశేఖరశర్మకు గురువారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. ఎస్‌జీటీ తత్సమాన కేడర్‌లో 1,161 మంది బదిలీ కాగా, 761 మంది మాత్రమే కొత్త స్కూళ్లలో చేరారని తెలిపారు. మిగతా వారిని తక్షణమే రిలీవ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగారావు, కట్టా శేఖర్, శోభన్‌బాబు, బాలాజీ, గాంధీరెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత రాజ్‌కుమార్

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బొగ్గు బ్లాకులన్నింటిని సింగరేణికే అప్పగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2, కేసీహెచ్‌పీలలో జరిగిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. అనంతరం సింగరేణి ఏరియా ఆస్పత్రిని సందర్శించి రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీవైసీఎంఓ మేరికుమారికి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, ఉపాధ్యక్షుడు మల్లెల రాంనర్సయ్య, నాయకులు మేకల ఈశ్వర్, ఆవుల నాగరాజు, సురేందర్, జి గంగాధర్‌రావు, అబ్దుల్ సుబాన్, రాజశేఖర్, పిట్ కార్యదర్శులు శ్రీనివాసరావు, రవి, పాపారావు, విజయ్‌కుమార్, వలీ, సుధాకర్, ఇమాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐ సస్పెన్షన్

దమ్మపేట: లంచం తీసుకున్న కేసుల్లో దమ్మపేట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్–2 జబ్బా ఎర్రయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన బండి లక్ష్మీరాయణరెడ్డి 2022లో తన కుటుంబ సభ్యుల నివాస ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ పత్రం ఇచ్చేందుకు ఆర్‌ఐ ఎర్రయ్య రూ.10,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో దరఖాస్తుదారుడు ఆర్‌కు ఫోన్ పే ద్వారా రూ.10,000 చెల్లించాడు. దీనిపై బాధితుడు ప్రస్తుత కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన దమ్మపేట తహసీల్దార్ నరేష్‌తో ప్రాథమిక విచారణ చేయించగా, లంచం తీసుకున్నట్టు తేలింది. ఆర్‌ఐ ఎర్రయ్య లంచం తీసుకున్నట్లు విచారణలో తేలడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారని తహసీల్దార్ నరేష్ తెలిపారు.

చార్‌ధామ్ యాత్రలో జమలాపురం రిటైర్డ్ ఈఓ మృతి



రమణమూర్తి (ఫైల్)

ఎర్రుపాలెం: చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ రిటైర్డ్ ఈఓ ఏవీ రమణమూర్తి (64) అక్కడ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌కు చెందిన రమణమూర్తి గతంలో జమలాపురం ఆలయ ఈఓగా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. ఇటీవల ఆయన చార్‌ధామ్ యాత్రకు వెళ్లగా ఉత్తరాఖండ్‌లో గుర్రం ఎక్కుతున్న సమయాన ఒక్కసారిగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకొచ్చేందుకు కుటుంబీకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, రమణమూర్తి మృతిపై జమలాపురం ఈఓ కె.జగన్మోహన్‌రావు, ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

వ్యక్తిపై హత్యాయత్నం

- 10 మేకలు, రూ.35 వేల నగదు అపహరణ

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లిలో అలవాల విఠల్‌రావుపై మంగళవారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగింది. అంతేకాక నిందితులు ఆయన ఇంటి నుంచి మేకలు, నగదును ఎత్తుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. విఠల్‌రావు గ్రామ సమీపాన తన పొలంలో షెడ్డు వేసుకుని మేకలు పెంచుతున్నాడు. రోజుమాదిరిగానే షెడ్డులో మంగళవారం రాత్రి నిద్రించగా ఐదుగురు వ్యక్తులు వచ్చి ఆయనపై కర్రలు, కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో ఆయన తప్పించుకుని గ్రామంలోకి పరుగెత్తాడు. అక్కడి నుంచి కుటుంబీకులను తీసుకొచ్చే సరికే దుండగులు షెడ్డులోని బీరువాలో భద్రపర్చిన రూ.35 వేల నగదుతో పాటు రూ.లక్ష విలువైన 10 మేకలను ఎత్తుకెళ్లారు. రెండు రోజుల కిందట మేకలు కావాలని వచ్చిన ఇద్దరు వ్యక్తులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారనే అనుమానంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, చికిత్స నిమిత్తం ఆయన్ను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిమ్మకాయలు వేశారనే ఫిర్యాదుతో కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లిలో ఇరువర్గాల వారు పరస్పరం ఇళ్లపై నిమ్మకాయలు విసురుకోవడంతో ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామంలోని బొడ్రాయి సెంటర్‌లో సిరికొండ మణి, రేపాకుల రాములమ్మ, బండారపు సైదులు, రాంబాయి పరస్పరం తమ ఇళ్లపై నిమ్మకాయలు వేశారని దూషించుకున్నారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామారావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీకి చెందిన సయ్యద్ మున్వర్ మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండా పోవడంతో ఆయన కుటుంబీకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాపీ పనిచేసే మున్వర్ భార్య, పిల్లలు హైదరాబాద్‌లో నివాసముంటుండగా.. ఆయన వారికి దూరంగా ఉంటున్నాడు. అయితే, ఆయన మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోగా ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

చోరీ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ఓ కాలనీలో జరిగిన చోరీ ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని సీతరామ్‌నగర్ కాలనీ చెందిన ఈర్ల భారతి తన భర్త పోతురాజుకు వైద్యం అందించేందుకు గత నెల 24న హైదరాబాద్‌లో కుమారుడి వద్దకు వెళ్లారు. కాగా గత నెల 29న పోతురాజు తమ్ముడు రామ్మోహనరావు సీతరామ్‌నగర్‌కాలనీలోని ఇంటి పరిశీలించి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. మంగళవారం ఇంటికి వచ్చిన భారతి 3 గ్రాముల బంగారం, రూ.8 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ B.A/ B.Com/ B.Sc/ B.BA/ M.A/ M.Com/ M.Sc/ M.B.A/ MCA/ Diploma / B.Tech/ D.Pharmacy/ B. Pharmacy/ BAMS/ BHMS in 6 Months. ✆ 9550 443 817. [B-190527]

Services

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధుల [illegible] వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి/భోజనం జీతం : [illegible] 8640400073 [H-799897]

CHANGE OF NAME

■ I, Pradeep Kumar Doppalapudi S/o. Pavan Kumar Doppalapudi, R/o. Chunchupalli (M), H.No. 4-1-133, Ramnagar Colony, Chunchupalli, Bhadradri Kothagudem, Bhadradri Kothagudem District. Declare that in my 10th SSC Memo & in my passport, Passport Number T4792248, it was wrongly mentioned as Saritha Doppalapudi. My Mother's name is Saritha Korrapati After her marriage she did not changed her Surname to Doppalapudi. So my mother's correct name is Saritha Korrapati as per her SSC Memo, Aadhar as well as in Pan Card. This is for all records [HA-32398]

Wanted

■ కొత్తగూడెం G.V. Mall నందు పనిచేయుటకు Staff యువతీ / యువకులు వెంటనే కావలెను. 9281115830, 8639707933. [M-1185237]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185238]

■ ఖమ్మంలోని వెలాసిటి Network నందు చేయుటకు సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, టెక్నికల్, ఫైబర్స్, హెల్పర్స్ వెంటనే కావలెను. సంప్ర. 9908022821, 8886661780 [M-1185253]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [H-799899]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-13695]

■ Daily Walk-in-Interviews English, Social, NS, PS, Maths. Salary 19,000 to 20,000 Little Flowers High School (EM), Bhadrachalam. Cell : 96180 01900. [M-1185169]

■ ఖమ్మంలో నెలకు 12,000/- రూ.ల జీతంతో LIC చీఫ్ అడ్వైజర్ ఆఫీస్‌లో పని చేయుటకు కనీసం ఇంటర్ చదివిన అభ్యర్థులు (3) పురుష అభ్యర్థులు, ఈ రోజు సా॥ 5 గం. జరిగే ఇంటర్వ్యూకు బయోడేటా ఫారంతో హాజరు కాగలరు. స్థలం LIC ఆఫీస్, గట్టయ్య సెంటర్. 98480 39047. [M-1185239]

■ NTR జిల్లా, జగ్గయ్యపేట మండలంలోని ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో మా సంస్థ తరుపున పనిచేయుటకు మంచి దేహదారుఢ్యము కలిగిన సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్‌వైజర్స్ అర్హతలు: 30-45 సం. ఇంటర్/ డిగ్రీ, ఎత్తు 05'-06" పైన. రిటైర్డ్ ఆర్మీ, పారా మిలిటరీ వారికి ప్రాధాన్యత. గార్డ్ అర్హతలు: 23-45 సం. పదవ తరగతి, ఎత్తు: 05'-06" ఆపైన సంప్ర: సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్, బృందావన్ గార్డెన్స్, SBI ప్రక్కన, గుంటూరు. email: kalahasti33@gmail.com 9951449686, 8466996958, 7095125556 [G-116]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783

బాబు భూ దోపిడీ ఖజానా!

అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం అరాచకాలు

- యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ భూముల దురాక్రమణ
- శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు బుట్టదాఖలు
- 'రాజధాని లీక్స్'పేరిట బురిడీ
- పక్కా పన్నాగంతో అమరావతి ఎంపిక
- బరితెగించి ఇన్‌సైడర్ ట్రేడింగ్..
- భయపెట్టి భూ మాయాజాలం
- అమరావతి కేంద్రంగా ఎల్లో గ్యాంగ్ రూ.లక్షల కోట్ల కుంభకోణం
- రాజధానిలో భూ బాగోతాలను కప్పిపుచ్చేందుకే శ్వేతపత్రం డ్రామా



సాక్షి, అమరావతి: ''ఏ''అంటే.. అమరావతి అని వక్కాణిస్తున్న సీఎం చంద్రబాబు రాజధాని ముసుగులో తన అవినీతి, అరాచకాలకు కేంద్రంగా చేసుకున్నారు! బరి తెగించి తాను పాల్పడిన అవినీతికి అక్షయ పాత్రలా మార్చారు! నాటి తెల్ల దొరలే తెల్లబోయేలా వ్యవహరించారు! బ్రిటీష్ పాలకుల సామ్రాజ్యవాద దోపిడీని మరిపిస్తూ టీడీపీ పెద్దలు సాగించిన భూ దోపిడీకి నిలువెత్తు సాక్ష్యం అమరావతి... బడుగులు, పేదలకు స్థానం లేకుండా చంద్రబాబు సృష్టించుకున్న నయా జమీందారీ వ్యవస్థకు నిదర్శనం అమరావతి! పచ్చ రాబందులు గుప్పిట పట్టిన రూ.లక్షల కోట్ల విలువైన భూ ఖజానా అమరావతి! దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ దోపిడీకి మౌనసాక్షి అమరావతి!! ఈ భూ బాగోతాలు, తన నిర్వాకాలను కప్పిపుచ్చి మభ్యపెట్టేందుకే తాజాగా అమరావతిపై శ్వేతపత్రం అంటూ మరో డ్రామాకు చంద్రబాబు తెర తీశారు.

మోయలేని భారం మోపుతూ...

రాజధానిగా అమరావతి ఎంపిక చేసిన ప్రాంతం ఇటు విజయవాడ కాదు.. అటు గుంటూరూ కాదు. మూడు పంటలు పండే సారవంతమైన పంట పొలాల్లో నిర్మాణ వ్యయం తడిసి మోపెడవుతుందని చంద్రబాబు అండ్ కో కట్టిన లెక్కలే చెబుతున్నాయి. ఒక్క ఎకరాలో కనీస మౌలిక వసతుల కల్పనకు (బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రూ.2 కోట్లు వ్యయం అవుతుందని, మొత్తం రాజధాని ప్రాంతం అభివృద్ధి చేయడానికి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చవుతుందని అప్పట్లోనే అంచనా వేశారు. ఏటా ఆ వ్యయం పెరగడమే కానీ తగ్గదు. విభజన అనంతరం రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత భారీగా నిధులు ఖర్చు చేయడం సాధ్యమయ్యే పని కాదని నిపుణులు చేసిన హెచ్చరికలను చంద్రబాబు పట్టించుకోలేదు. తాజాగా భారీగా నిధులు అవసరమంటూనే.. వివరాలు సేకరిస్తామని చెబుతున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన టీడీపీ ప్రభుత్వం.. సంపదను ఎలా సృష్టించి రాజధాని నిర్మాణం చేస్తుందనే ప్రశ్నకు జవాబు లేదు.

భూములు లాక్కుని గాలి మేడలు..!

అమరావతి వేదికగా చంద్రబాబు సాగించిన భూ దందాను అప్పట్లోనే నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అనువైనది కాదని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టం చేసింది. ఏడాదికి మూడు పంటలు పండే భూములను నాశనం చేయవద్దని పర్యావరణవేత్తలు అభ్యంతరం చెప్పారు. జీవనాధారమైన తమ భూములను కొల్లగొట్టవద్దని బడుగు, బలహీనవర్గాలు, పేద రైతులు వేడుకున్నారు. వారి విన్నపాలను బేఖాతర్ చేస్తూ చంద్రబాబు భారీ భూదోపిడీకి తెరతీశారు. అసైన్డ్ భూములను బినామీల ద్వారా హస్తగతం చేసుకుని పరిహారం ప్రకటించుకున్నారు. 2014–19 మధ్య రాజధాని పేరిట అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం చేయని దురాగతం లేదు. అదిగో రాజధాని.. అల్లదిగో అమరావతి..! అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. అంతకుముందు పక్కా పన్నాగంతో రాజధాని అక్కడ.. ఇక్కడ అంటూ పలు ప్రాంతాల పేర్లను తెరపైకి తెచ్చి సామాన్యులను బురిడీ కొట్టించారు. మరోవైపు ముందస్తుగా తాము భూముల కొనుగోలు చేసిన అమరావతిలో బినామీ మాఫియాను వ్యవస్థీకృతం చేశారు. అంతర్జాతీయ స్థాయి రాజధాని.. ఆకాశ హర్మ్యాల నగరం అంటూ గాలిలో మేడలు కట్టి రైతుల కాళ్ల కిందున్న భూమిని కాజేశారు.

పచ్చ దండు దురాక్రమణ..

దేశంలోనే కాదు ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీకి చంద్రబాబు బరి తెగించారు. రాజధాని ప్రచారంతో మాయాజాలం... భూసమీకరణ ముసుగులో దోపిడీ... అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, లంక భూముల స్వాహా... ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి మలుపులు... అస్మదీయులకు యథేచ్ఛగా భూ పందేరాలు... ఇలా ఒకటేమిటి ఎన్ని రకాలుగా భూదోపిడీకి పాల్పడవచ్చో అన్ని విద్యలూ ప్రయోగించారు. అమరావతిపై చంద్రబాబు 'పచ్చ దండు'దండయాత్ర చేసి రూ.లక్షల కోట్ల విలువైన భూముల దురాక్రమణకు పాల్పడింది. చంద్రబాబుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు, టీడీపీ నేతలు, వారి బినామీలు అమరావతి భూములపై వాలిపోయారు. చంద్రబాబు, లోకేశ్‌తోపాటు నారాయణ, సుజనా చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మాగుంట మురళీమోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామకృష్ణ, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావు.. ఇలా పచ్చ దండు అంతా అమరావతిలో భూములను కొల్లగొట్టింది. అన్యాయంగా, ఏకపక్షంగా విభజనకు గురై కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఆదిలోనే హంసపాదులా అభివృద్ధికి గండి కొట్టారు. తాత్కాలిక రాజధాని భవనాల పేరుతో కనికట్టు చేశారు.

మభ్యపుచ్చే యత్నాలు..

నాడు ఐదేళ్లలో భూముల దోపిడీకి పాల్పడటం మినహా టీడీపీ పెద్దలు రాజధాని కట్టింది లేదు.. అభివృద్ధి చేసిందీ లేదు. చంద్రబాబు బృందం సాగించిన భూ దోపిడీ ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతోసహా బట్టబయలైంది. సీఐడీ న్యాయస్థానాల్లో చార్జిషీట్లు కూడా దాఖలు చేసింది. ఇక న్యాయ విచారణ ప్రక్రియ కొనసాగితే చంద్రబాబుకు యావజ్జీవ ఖైదు ఖాయమని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అధికారంలోకి రాగానే చంద్రబాబు సరికొత్త కుట్రలకు పన్నాగం పన్నుతున్నారు. అమరావతిలో తన భూ బాగోతాన్ని కప్పిపుచ్చేందుకు శ్వేతపత్రం పేరుతో డ్రామాకు తెర తీశారు. రాజధాని నిర్మాణానికి తాను ఏం చేస్తానో చెప్పకుండా ఊకదంపుడు ఉపన్యాసంతో ఊదరగొట్టారు. రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. కానీ అమరావతి పేరిట చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన దోపిడీ దాచేస్తే దాగేది కాదు. ఇప్పటికే పూర్తి ఆధారాలతో సహా చార్జిషీట్ల రూపంలో నిక్షిప్తమైందన్నది నిఖార్సైన నిజం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

శ్రీవారి సేవలో భారత మహిళా క్రికెటర్లు

తిరుమల: తిరుమల శ్రీవారిని మహిళా క్రికెటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



తిరుమల ఆలయం వెలుపల భారత మహిళా క్రికెటర్లు

జస్టిస్ శరత్, రేవంత్‌ల ఫోన్లు ట్యాపింగ్

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీ చేసింది. తాజాగా ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌ల ధర్మాసనం బుధవారం మధ్యాహ్న విరామం తర్వాత విచారణ చేపట్టింది.

విచారణ 23వ తేదీకి వాయిదా..

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేశామని ధర్మాసనానికి వివరించారు. కేసు ఎప్పుడు నమోదు చేశారు? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ అయ్యాయి? నిందితులెవరు? కేసు పురోగతి ఎంత వరకు వచ్చింది వంటి వివరాలు అందులో పేర్కొన్నామని.. కానీ ఇంకా రికార్డు కాలేదని చెప్పారు. ఈ వివరాలను రికార్డు చేయాలని కోర్టు అధికారులను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను కూడా బాధితుడినేనని, పోలీసు అధికారుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొన్నానని.. తనను ఈ పిటిషన్‌లో ఇంప్లీడ్ చేయాలంటూ సిద్దిపేట జిల్లాకు చెందిన హయతుద్దీన్ వేసిన పిటిషన్‌పై నిర్ణయాన్ని కూడా ధర్మాసనం వాయిదా వేసింది.

ప్రభుత్వం అఫిడవిట్లో పేర్కొన్న వివరాలివీ..

''నాయిని భుజంగరావు (ఏ3) వాంగ్మూలం మేరకు.. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు, జస్టిస్ కాజా శరత్, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదిస్తున్న న్యాయవాదులు, పార్టీ నేతల వ్యక్తిగత జీవితం, చేసే పనులు తెలుసుకుని ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేలా ప్రభావితం చేశారు. బీఆర్‌ఎస్‌కు ఇబ్బందికర పరిస్థితి వచ్చినప్పుడల్లా అవతలి వారి ఫోన్లు ట్యాప్ చేసి బెదిరించేవాళ్లు. హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలకు ఎర కేసులో, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ అంశం సమయంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. 'నేను కీలక వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించి ప్రణీత్‌కుమార్‌కు అందజేసేవాడిని. వారి ఫొటోలు, అడ్రస్‌లు సేకరించి చర్యలు తీసుకోవడం కోసం ఇంటెలిజెన్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు పంపేవాళ్లం' అని భుజంగరావు చెప్పారు. టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి వివరాలు సేకరించినట్లు, ఫోన్ నంబర్ చెబితే వారి కాల్‌లకు సంబంధించి వివరాలు కూడా సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చినట్లు తెలిసింది. జస్టిస్ కాజా శరత్, ఆయన సతీమణి మాధవి నంబర్లు, కాల్‌ల వివరాలు, అడ్రస్‌లు జియో ఆఫీస్ నుంచి తెలుసుకున్నారు.

కీలక వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్..

సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి, ఎనుముల తిరుపతిరెడ్డి, విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఈటల నితిన్, శివధర్‌రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్, రాఘవేందర్‌రెడ్డి, రోనాల్డ్ రోస్, ధర్మపురి అర్వింద్, ఎం.రమేశ్‌రెడ్డి, మేఘా శ్రీనివాస్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్, పీడీ కృష్ణకిశోర్, ఐఏఎస్ దివ్య, తాటినేని శశాంక్, రాజ్‌న్యూస్ సునీల్‌రెడ్డి, చిలుకా రాజేందర్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, నరేంద్రనాథ్ చౌదరి, తీన్మార్ మల్లన్న (నవీన్), ఏఎంఆర్ ఇన్‌ఫ్రా మహేశ్‌రెడ్డి, వీరమళ్ల సత్యం, గాలి అనిల్‌కుమార్, రామసాయం సురేందర్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేరెడ్డి స్వప్నిక, కాసాని జ్ఞానేశ్వర్, కొల్లే సరిత, అంజన్న (ఈటల గన్‌మన్), అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మనాల మోహన్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు మరికొందరి ఫోన్లను ట్యాప్ చేశారు.

మధ్యవర్తిగా టీవీ 5 సాంబశివరావు..

సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు, టీవీ 5 సాంబశివరావులకు సంబంధించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ వివాదం ఉంది. ఈ పంచాయతీని సాంబశివరావు భుజంగరావు వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావుపై చాలా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వాటి నుంచి బయటపడాలంటే రూ.15 కోట్లు బీఆర్‌ఎస్‌కు పార్టీ ఫండ్‌గా ఇవ్వాలని భుజంగరావు ఒత్తిడి తెచ్చారు. శ్రీధర్‌రావు రూ.13 కోట్లు విలువైన బీఆర్‌ఎస్ బాండ్లు కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం వహించిన సాంబశివరావు రూ.2 కోట్లు తీసుకున్నారని భుజంగరావు వాంగ్మూలంలో పేర్కొన్నారు..'' అని ప్రభుత్వం అఫిడవిట్‌లో తెలిపింది. వీటితోపాటు మరిన్ని వివరాలనూ వెల్లడించింది.

జిల్లా వార్తలు

ఎట్టకేలకు విడుదల

- జిల్లా జైలు నుంచి నలుగురు ఖైదీలకు విముక్తి

ఖమ్మంరూరల్: వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో నలుగురికి విముక్తి లభించింది. ఈ మేరకు ఖమ్మం రూరల్ మండలం రామన్నపేటలోని జిల్లా జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న నలుగురిని మంగళవారం విడుదల చేశారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భరణిపాడుకు చెందిన కె.జయరాజు, రఘునాథపాలెం మండల కేంద్రానికి చెందిన వై.పర్వతాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన డి.వీరయ్య, దమ్మపేటకు చెందిన ఉదయ్‌చందర్ వివిధ కేసుల్లో జీవిత ఖైదు అనుభవిస్తుండగా ప్రభుత్వ నిర్ణయంతో బయటకు వచ్చారు. అలాగే, ఖమ్మం జిల్లాకు చెందిన జి.చెన్నయ్య చర్లపల్లి జైలులో జీవిత ఖైదు అనుభవిస్తుండగా ఆయన సైతం విడుదలయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజావాణిలో జీవితఖైదు అనుభవిస్తున్న వారి కుటుంబ సభ్యులు తమ వారి విడుదల విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. దీంతో గవర్నర్ వద్ద ఉన్న ఫైల్ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆమోదం లభించింది. కాగా, విడుదలైన వారు తాము ఇచ్చిన శిక్షణ మేరకు ఉపాధి పొందే అవకాశముందని జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు.

కోటి తలంబ్రాల వరి విత్తనాలకు పూజలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో కల్యాణోత్సవానికి సమర్పించే కోటి గోటి తలంబ్రాలకు సంబంధించి వరి విత్తనాలకు బుధవారం ఆలయంలో పూజలు నిర్వహించారు. కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం బాధ్యులు బుధవారం వరి విత్తనాలతో భద్రాచలం చేరుకుని స్వామి సన్నిధిలో పూజలు చేయించారు. వీటిని సాగు చేశాక ధాన్యాన్ని గోటితో ఒలిచి శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణోత్సవానికి సమర్పిస్తామని బాధ్యులు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీలోని విశాఖపట్నం జిల్లా భక్తులు బుధవారం విరాళం అందించారు. పెద్దగంత్యాడ మండలం నాడుపూరుకు చెందిన రాధాకృష్ణమూర్తి – సుశీల దంపతులు రూ.2 లక్షలను ఈఓ రమాదేవికి అందజేసి స్వామిని దర్శించుకున్నారు.

వాహనం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి

కొణిజర్ల: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొణిజర్ల మండలం లక్ష్మీపురం సమీపాన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఖమ్మం పాకబండ బజార్‌కు చెందిన చావడవపు వినయ్‌కుమార్(46) బైక్‌పై ఏన్కూరు వెళ్తూ లక్ష్మీపురం వద్ద ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అటవీ ఉత్పత్తుల సేకరణ అంతంతే..

- ఫలితంగా లక్ష్యాన్ని చేరని జీసీసీ
- డీఎంతో సహా మేనేజర్ల కొరతతో ఇక్కట్లు
- గతేడాది రూ.1.50 కోట్ల లక్ష్యంలో రూ.23.18 లక్షల మేరకే కొనుగోళ్లు



పాల్వంచలోని జీసీసీ కార్యాలయం



ముష్టిగింజలను పరిశీలిస్తున్న గిరిజనులు



ముష్టికాయలను సేకరిస్తున్న గిరిజన మహిళ

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) లక్ష్యాలను అధిగమించలేక కుంటుపడుతోంది. అటవీ ప్రాంతాల్లో గిరిజనులు సేకరించే అటవీ ఫలాలను అనుకున్న లక్ష్యం మేరకు కొనుగోలు చేయలేక ఆర్థికంగా కునారిల్లుతోంది. భద్రాచలం ఐటీడీఏ పరిధి గిరిజన సహకార సంస్థలో భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు, దమ్మపేట, మణుగూరు బ్రాంచ్ కార్యాలయాలు, 150 డీఆర్ డిపోలు ఉన్నాయి. అయితే, రాష్ట్ర విభజన తర్వాత అటవీ ఉత్పత్తులు అధికంగా లభించే కుక్కునూరు, చింతూరు మండలాలు ఏపీలో కలవడం, జిల్లాల విభజనతో భద్రాచలం జీసీసీ నుంచి వెంకటాపురం (కే), ములుగు జిల్లాలో కలవడంతో జీసీసీకి కష్టాలు మొదలయ్యాయి.

సేకరణ, కొనుగోళ్లలోనూ వెనుకబాటు

2023 – 2024 ఆర్థిక సంవత్సరంలో ఐదు బ్రాంచ్‌ల పరిధిలో రూ.1.55 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనేది లక్ష్యం. ఇందులో కేవలం రూ.23.18 లక్షల మేర ఉత్పత్తులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు. ముష్టిగింజలు 2081.50 క్వింటాళ్లకు 13.20 క్వింటాళ్లు, చిల్లిగింజలు 31 క్వింటాళ్లకు 7.20 క్వింటాళ్లు, ఇప్పపువ్వు 792 క్వింటాళ్లకు 281.08 క్వింటాళ్లు, ఇప్పబద్ద 993 క్వింటాళ్లకు 449.50 క్వింటాళ్లు, నరమామిడి చెక్క 23 క్వింటాళ్లకు 4.45 క్వింటాళ్లు, కానుగపప్పు 38 క్వింటాళ్లకు 14.55 క్వింటాళ్లు, కుంకుడుకాయలు 10 క్వింటాళ్లకు 8.23 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయగా గింజ లేని చింతపండు 70 క్వింటాళ్ల లక్ష్యం కాగా కేజీ కూడా కొనుగోలు చేయలేదు. అంతేకాక జీసీసీ ద్వారా గతేడాది బియ్యం 36 క్వింటాళ్లు విక్రయించాలనేది లక్ష్యం ఉండగా 13 క్వింటాళ్లు, 8,683 లీటర్ల పెట్రోల్‌కు 6 వేల పైచిలుకు లీటర్లు మాత్రమే విక్రయించారు. ఇలా సేకరణ, అమ్మకాల్లోనూ జీసీసీ వెనుకబడింది.

మధ్యలోనే దళారుల పాలు

జిల్లాలోని జీసీసీ పరిధిలో డీఆర్ డిపోల ద్వారా అటవీ ఫలాలను గిరిజనుల ద్వారా కొనుగోలు చేసి గ్రామాల్లోని డిపోల్లో విక్రయించేవారు. అయితే, కొందరు దళారులు నేరుగా గిరిజనుల వద్దకు వెళ్లి అటవీ ఫలాలను సేకరిస్తున్నారు. దీంతో డిపోలకు సరుకు రావడం తగ్గిపోయింది. ఇటీవల పాల్వంచలోని జీసీసీ డిపోను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ రాహుల్ ఈ విషయాన్ని గుర్తించి.. గిరిజనులు నేరుగా సేల్స్ డిపోల్లో విక్రయించేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అయితే, గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ విజయ్‌కుమార్ మేలో ఉద్యోగ విరమణ చేయగా ఇంకొకరిని నియమించకుండా ఇన్‌చార్జ్ డీఎంగా మణుగూరు మేనేజర్ దావూద్‌కు బాధ్యతలు అప్పగించారు. అలాగే, భద్రాచలం బ్రాంచ్, ఇల్లెందు బ్రాంచ్‌లకు సైతం ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. మణుగూరు మేనేజర్‌కు డీఎంగా బాధ్యతలు అప్పగించడంతో రెండు బాధ్యతలకు న్యాయం చేయలేకపోతున్నారని తెలుస్తోంది. డిపో మేనేజర్ల పరిస్థితి అలాగే ఉన్నందున రెగ్యులర్ మేనేజర్లను నియమించడంతో పాటు గిరిజనులు జీసీసీ డిపోలకే వచ్చేలా పర్యవేక్షిస్తే లక్ష్యం మేరకు అటవీ ఉత్పత్తుల సేకరణ, అమ్మకాలు సాధ్యమవుతాయని చెబుతున్నారు.

'సీతారామ' విషయంలో కేసీఆర్‌ది మోసం

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకుండా మాజీ సీఎం కేసీఆరే రైతులు, ప్రజలను మోసం చేశారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆరోపించారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన హరిప్రియ ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు పూర్తి చేయించలేదని నిలదీశారు. ఇప్పుడు ఆమె తనను విమర్శించడం సరికాదని.. ప్రజలు ఎవరిని నమ్మారో ఎన్నికల ఫలితాలతోనే అర్థమైందని చెప్పారు. ఇక ఐదు దఫాలు ఎమ్మెల్యేగా కొనసాగిన గుమ్మడి నర్సయ్య గడిచిన ఐదేళ్లలో ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చేసినా ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలని సూచించారు. తాను మాత్రం పదవి ఉన్నా లేకున్నా ఇల్లెందు అభివృద్ధిని విస్మరించలేదని చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న తమ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని, ఈ విషయంలో ప్రతిపక్షాల నాయకులు సలహాలు ఇవ్వాలే తప్ప అనవసర విమర్శలు చేయొద్దని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు డానియల్, పులి సైదులు, మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, నాయకులు రాము, కొక్కు నాగేశ్వరరావు, పత్తి స్వప్న, మడుగు సాంబమూర్తి, ఇమామ్, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఏరియాల్లోనే 100 శాతం ఉత్పత్తి

- సింగరేణివ్యాప్తంగా జూన్‌లో 102 శాతం ఉత్పత్తి
- గడిచిన నాలుగు నెలల్లో ఆర్జీ–2కు మొదటిస్థానం



ఓపెన్ కాస్ట్ గనిలో బొగ్గు లోడ్ చేస్తున్న పొక్లెయినర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థవ్యాప్తంగా గడిచిన జూన్‌లో 102 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైంది. సంస్థ పరిధిలోని 22 భూగర్భగనులు, 18 ఓసీల్లో నిర్దేశించుకున్న 54,05,904 టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 55,04,326 టన్నుల (102 శాతం) ఉత్పత్తి నమోదైంది. ఇందులో ఓసీల్లో 49,26,000 టన్నులకు గాను 50,97,178 టన్నులు, భూగర్భగనుల్లో 4,07,148 టన్నులకు 1,65,100 టన్నుల ఉత్పత్తి నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా, జూన్‌లో నాలుగు ఏరియాల్లోనే వంద శాతం దాటడం, మిగతా ఏరియాల్లో ఉత్పత్తి వెనకబడటం గమనార్హం.

చాలా ఏరియాల్లో వెనుకబాటు

సింగరేణి పరిధిలో 11 ఏరియాలకు గాను రోజు, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించినా చాలా ఏరియాల్లో ఆ స్థాయిలో ఉత్పత్తి నమోదు కావడం లేదు. జూన్ గణాంకాలను పరిశీలిస్తే ఆండ్రియాల ఏరియాలో 165 శాతం ఉత్పత్తి నమోదు కాగా, ఆర్జీ–2లో 155 శాతం, ఇల్లెందు, బెల్లంపల్లిలో 112, ఆర్జీ–1 ఏరియాలో 103 శాతం ఉత్పత్తి నమోదైంది. ఇక కొత్తగూడెం ఏరియా 99 శాతం, మణుగూరు 94, మందమర్రి 94, శ్రీరాంపూర్ 84, ఆర్జీ–3 ఏరియా 96, భూపాలపల్లి 65 శాతానికే పరిమితమయ్యాయి. కాగా, రోజువారీ ఉత్పత్తిని పరిశీలిస్తే 35 వేల టన్నుల కొత్తగూడెం ఏరియా మొదటి స్థానంలో నిలిచింది. ఇక 30 వేల టన్నులతో మణుగూరు, 23 వేలకు పైగా టన్నులతో ఆర్జీ–2 ఏరియా ఆ తర్వాత స్థానాలు దక్కించుకున్నాయి.

గత నాలుగు మాసాల్లో ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి

ఏరియా	లక్ష్యం (టన్నుల్లో)	ఉత్పత్తి (టన్నుల్లో)	శాతం
ఆర్జీ-2	17,52,400	24,17,029	138
ఇల్లెందు	9,21,000	10,05,280	109
బెల్లంపల్లి	9,70,000	9,98,963	103
కొత్తగూడెం	35,13,500	32,58,774	93
మణుగూరు	33,91,000	32,76,811	97
మందమర్రి	10,19,500	8,46,665	83
శ్రీరాంపూర్	16,03,900	12,75,097	79
ఆర్జీ-1	12,15,700	11,36,666	93
ఆర్జీ-3	16,14,000	15,27,066	95
ఆండ్రియాల	2,77,400	2,33,733	84
భూపాలపల్లి	10,35,600	7,33,588	71

లక్ష్యాలను సాధించాల్సిందే..



గనులకు కేటాయించిన రోజు, నెలవారీ లక్ష్యాలను తప్పకుండా సాధించాలి. ఎక్కడైనా యాంత్రికపరమైన లేదా ఇతర సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను జీఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. గైర్హాజరు కార్మికులకు మరోమారు కౌన్సెలింగ్ ఇస్తాం.

–ఎన్వీకే.శ్రీనివాస్, సింగరేణి డైరెక్టర్(పా)

ఖమ్మంలో మంథని మున్సిపల్ బృందం

నగరంలో అభివృద్ధి పనుల పరిశీలన



ఖమ్మం మేయర్ నీరజతో భేటీ అయిన మంథని మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

ఖమ్మంమయూరిసెంటర్: పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌తో పాటు 28 మంది సభ్యులతో కూడిన బృందం బుధవారం ఖమ్మం నగరంలో పర్యటించింది. రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో ఖమ్మం వచ్చిన వారు తొలుత కేఎంసీ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజను కలిశారు. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్రి రమ, కమిషనర్ మల్లికార్జున్‌స్వామి తదితరులు ఈ భేటీలో పాల్గొనగా కార్పొరేషన్ కార్యాలయం, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, లకారం చెరువు, కొండా లక్ష్మణ్ బాపూజీ పార్క్, వైకుంఠధామం, పాతబస్టాండ్ వద్ద స్ట్రీట్‌వెండర్ల మార్కెట్, దానవాయిగూడెం ఎఫ్‌ఎస్‌టీపీ, డంపింగ్‌యార్డ్, కేఎంసీ కార్యాలయం వెనుక డీఆర్‌డీసీతో పాటు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఎం.శ్రీనివాస్, మంథని కౌన్సిలర్లు గుండ విజయలక్ష్మి, ఎం.నాగేంద్ర, హన్మంతు, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.